మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

బహిరంగ చర్చకు సిద్ధం

- ఏఎంసీ చైర్మన్ ఆరోపణల్లో వాస్తవం లేదు
- కేటీఆర్ నాయకత్వంలోనే సిరిసిల్ల అభివృద్ధి
- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, జూన్ 22 : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఏఎంసీ చైర్మన్ వెలుముల స్వరూపను అభివృద్ధిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటులో తాను రూ.70 లక్షలు అవినీతికి పాల్పడినట్లు చేసిన ఆరోపణలను దమ్ముంటే రుజువు చేయాలన్నారు. కాంట్రాక్టర్ చేసిన పనులకు తనకు ఏ సంబంధం ఉంటుందన్నారు. క్రీడాప్రాంగణాలు పేరిట రూ.30 లక్షలు తీసుకున్నామని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సదరు ఆరోపణలపై అధికార పార్టీలో ఉన్న మీరు సంబంధిత ఎంబీ రికార్డు తీసుకొని వస్తే గాంధీచౌక్‌లో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తమ హయాంలో ఏడాదిన్నర కాలంలోనే మున్సిపల్ పరిధిలో దాదాపు రూ.80 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా తాను ఉన్న సమయంలో ఆరు నెలల వ్యవధిలోనే రూ. 25 కోట్ల నిధులతో ఏఎంసీ భవనం నిర్మించామన్నారు. రైతుబజార్ సైతం తమ పాలనలోనే నిర్మించామని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు కేటీఆర్ రూ. 270 కోట్లు ఇవ్వకుండా పోయారని అనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. గతంలో తమ పాలకవర్గం హయాంలో రూ.40 కోట్ల పనులకు తాము టెండర్లు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్‌లో పెట్టిందన్నారు. రూ.3 కోట్ల నిధులు లింక్ రోడ్ల కోసం కేటాయించగా, ఆ నిధులను సైతం ఆపేశారన్నారు. అభివృద్ధి చేయాలని అధికారం ఇస్తే అహంకారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రూ. కోటిన్నర నామినేటెడ్ పనులు వచ్చినప్పటికీ ఏ ఒక్క పని ప్రారంభించలేదన్నారు. బిల్లులు వస్తాయో రావోనని సందేహంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల బాలయ్య, పోచవేని ఎల్లయ్య, లింగంపల్లి సత్యనారాయణ, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, మ్యాన రవి, సత్తార్, మామిడాల కృష్ణ, దూస రాజేశం, బుర్ర మల్లికార్జున్, సుంకపాక మనోజ్‌కుమార్, జిందం దేవదాస్, వెంగళ శ్రీనివాస్, పోరండ్ల రమేశ్, ఎలుక వెంకన్న, సబ్బని హరీశ్, రిక్కుమల్లె సంతప్, అడిచర్ల సాయికృష్ణ, వెంగళ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ సహకరించాలి

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ అంజయ్య

వేములవాడ రూరల్, జూన్ 22: మాదక ద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని వేములవాడ రూరల్ ఎస్ఐ అంజయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని హన్మాజీపేటలో జిల్లా ఎస్పీ మహేశ్ బీగితె ఆదేశాల ప్రకారం.. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంజయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూల కోసం ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల సాగుచేసిన, రవాణా చేసిన, సేవించినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తుకు బానిసలు కావద్దన్నారు. తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ తీశారు. మహిళా సంఘాల సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

వెలుగని హైమాస్ట్ లైట్లు .. అంధకారంలో గాంధీ సెంటర్

రాజన్న సిరిసిల్ల, జూన్ 22 (నమస్తే తెలంగాణ): నిత్యం రద్దీగా ఉండే గాంధీ సెంటర్ అధికారుల నిర్లక్ష్యంతో అంధకారం అలుముకుంది. హైమాస్ట్‌లైట్లు, వీధి దీపాల వెలుగులు జిలుగుల్లో ధగధగా మెరిసే చౌరస్తాలోని గాంధేయుడు చీకట్లో మగ్గుతున్నాడు. ఆదివారం కార్యాలయాలకు సెలవైనందునేమో? సిబ్బంది లైట్లు వేయడం మరిచారా ? అని ప్రజలు చర్చించుకున్నారు.

రాణాలో ఒకరి ఆత్మహత్యాయత్నం

- భూమి పంచాయితీ విషయంలో కేసు నమోదు
- తంగళ్లపల్లి పీఎస్‌లో ఎస్ఐ ఎదుటే పురుగుల మందుతాగి అఘాయిత్యం
- హుటాహుటిన దవాఖానకు తరలింపు
- జిల్లాలో కలకలం

చికిత్స పొందుతున్న వెల్పుల కృష్ణ

మాట్లాడుతున్న వెల్పుల సత్తవ్వ, అమె కొడుకు అభిలాష్, వెల్పుల రవి

సిరిసిల్ల రూరల్, జూన్ 22: భూమి పంచాయితీ విషయంలో కేసు నమోదు కావడంతో ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయతాన్నికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వెల్పుల బలరాం, వెల్పుల కృష్ణ సొంత అన్నదమ్ములు. గ్రామంలో కృష్ణ (3.09ఎకరాలు), బలరాంతోపాటు సమీప బంధువు వెల్పుల రవికి చెందిన భూములు పక్కపక్కనే ఉన్నాయి. అయితే కొన్ని రోజులుగా బలరాం, కృష్ణ కుటుంబాల మధ్య భూ తగాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయితీ జరిగినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. బలరాం 2019లో అనారోగ్యంతో మృతి చెందినా.. భూ వివాదాలు అలాగే ఉన్నాయి. భూమి విషయంలో తమను కృష్ణ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బలరాం భార్య సత్తవ్వ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈనెల 21న ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు కృష్ణ ఆదివారం శ్రీనివాసరెడ్డి, మరో ఇద్దరితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. మీపై కేసు నమోదైందని ఎస్ఐ రామ్మోహన్ కృష్ణకు చెప్పాడు. ఏకపక్షంగా ఎలా మాట్లాడుతారు? సివిల్ మ్యాటర్‌లో ఎలా కేసు చేస్తారు అంటూ.. కృష్ణ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న శ్రీనివాస్‌రెడ్డితోపాటు పోలీస్ సిబ్బంది అడుకుని హుటాహుటిన సిరిసిల్ల దవాఖానకు తరలించారు. భూవివాదాల్లో అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య ఆత్మహత్య ఘటన మరకవకు ముందే కృష్ణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం జిల్లాలో కలకలంరేపింది.

మా భూమి మాకు ఇప్పించండి : వెల్పుల సత్తవ్వ

మా భూమి ఇప్పించాలంటూ చీర్లవంచకు చెందిన వెల్పుల సత్తవ్వ, ఆమె కొడుకు అభిలాష్ వేడుకున్నారు. తమను చిన్నాన్న కృష్ణ వేధిస్తున్నాడని, మా భూమిలో ఖనిలు పాతి, దౌర్జాన్యం చేశాడని అభిలాష్ ఆరోపించారు. మాజీ సర్పంచ్ రవితోపాటు పెద్దలు పిలిచినా పంచాయితీకి రావడం లేదని, ఎవరికీ చెప్పుకొంటా చెప్పుకొమ్మంటూ బెదిరిస్తున్నాడని వాపోయాడు. భూమి విషయంలో మమ్మల్ని ఆరేండ్లుగా వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశాడు. మా 2.02ఎకరాల భూమిని మ్యూటేషన్ సైతం చేసుకున్నాడని తెలిపారు. గతంలో మమ్మల్ని బెదిరించినట్లే.. ఇప్పుడు మందుతాగి ఎస్ఐని బద్‌నాం చేస్తున్నాడన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు. వారి వెంట వెల్పుల రవి, తదితరులు ఉన్నారు.

వెల్పుల కృష్ణపై క్రిమినల్ కేసు

చీర్లవంచకు చెందిన వెల్పుల కృష్ణపై క్రిమినల్ కేసు నమోదు చేశామని తంగళ్లపల్లి ఎస్ఐ రామ్మోహన్ సోమవారం రాత్రి వేళలో ఒక ప్రకటన విడుదల చేశారు. చీర్లవంచకు చెందిన వెల్పుల బలరాం, తన తమ్ముళ్లు కృష్ణ, బాలకిషన్‌తో కలిసి చీర్లవంచ శివారులో 15ఏండ్ల క్రితం సర్వే నంబర్ 586/6/1లో ఏడెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. అయితే సదరు భూమిలోంచి రోడ్డు కోసం 1.10ఎకరాల పోగా మిగతాది సమానంగా పంచుకున్నారు. ఐదేండ్ల క్రితం బలరాం మృతి చెందగా, ఇదే అదునుగా భావించిన కృష్ణ సదరు భూమి మొత్తం కబ్జా చేయాలని దురుద్దేశంతో ప్రైవేట్ సర్వేయర్‌ను తెచ్చి తనకు అనుకూలంగా హద్దులు మార్చాడు. ఇదేంటని ప్రశ్నించిన బలరాం భార్య సత్తవ్వను చంపుతానని బెదిరింపులకు గురిచేశాడు. సత్తవ్వ ఫిర్యాదు మేరకు కృష్ణపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అతడిపై నమోదైన కేసు నుంచి విముక్తి పొందడం కోసం పథకం ప్రకారం పురుగుల మందు తాగే ప్రయత్నం చేశాడు. గతంలో వెల్పుల కృష్ణ తన అన్న కొడుకు వెల్పుల రవిపై హత్యయత్నం చేయగా, న్యాయస్థానం కృష్ణకు ఏడేండ్ల శిక్ష విధించిందని ఎస్ఐ వివరించారు.

మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జిందం కళ

అభివృద్ధి చేతగాకనే వ్యక్తిగత విమర్శలు

- అహంభావంతో మాట్లాడితే సహించేదిలేదు
- మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, జూన్ 22 : కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి చేతగాకనే వ్యక్తిగత విమర్శలు దిగుతున్నారని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల ముందే ఉందన్నారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రస్తుతం మీరు ఉంటున్న ఏఎంసీ భవనం కేటీఆర్ హయాంలో నిర్మించిందేనని గుర్తుంచుకోవాలన్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో పట్టణాభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలని సవాల్ విసిరారు. మా పాలకవర్గం హయాంలో ఇచ్చిన నిధులను కాంగ్రెస్ నేతలు తెచ్చినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. విమర్శలు అనేవి రాజకీయంగా ఉండాలి గాని, వ్యక్తిగతంగా ఉంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఏఎంసీ చైర్మన్ హోదాలో ఉన్నామని అహంభావంతో మాట్లాడినా తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. మేమెక్కడా వ్యక్తిగతంగా ఆరోపణలు, విమర్శలు చేయలేదన్నారు. చదువు ఉంటే సరిపోదని సంస్కారం కూడా ఉండాలని హితవు పలికారు. 3వ వార్డు అభివృద్ధి విషయంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఐదేండ్ల పాలకవర్గంలో అనేక నిదులు తెచ్చి అభివృద్ధి చేశామని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో మేము అందరికీ సమానంగా పనులు చేసిపెట్టామన్నారు. మున్సిపల్‌లో అవినీతి జరిగిందంటూ మీరు చేసిన ఆరోపణలు దమ్ముంటే రుజువు చేయాలన్నారు. పదవులు ఎప్పటికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. వ్యక్తిగతంగానే మాట్లాడతామంటే మేము కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ, తమ నాయకుడు చక్రపాణిని ఉద్దేశిస్తూ ఏఎంసీ చైర్మన్ స్వరూప చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్లను అభివృద్ధిలో నిలిపిన నాయకుడు చక్రపాణి అని కొనియాడారు. తండ్రి వయసున్న వ్యక్తిపై ఇటువంటి మాటలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సన్నబియ్యం మీ ఇంట్లో నుంచి ఇవ్వడంలేదని గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ అభివృద్ధి చేయలేదని మాట్లాడిన మీరు కాంగ్రెస్ వచ్చాక చేసిన అభివృద్ధి ఏంటో చూపాలన్నారు. రాబోవు ఎన్నికల్లో గెలవబోమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్నారు. ప్రజలకు ఏ ఒక్క హామీని అమలుచేయడం లేదన్నారు. మరోసారి మా నాయకుడు చక్రపాణిపై ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు పోచవేని సత్య, కల్లూరి లత, అరుణ, సీమాబేగం, గాజుల జ్యోతి, ఆస్మా, తదితరులున్నారు.

లక్ష్మణ్‌ను శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్తులు

ఏఎస్ఐ లక్ష్మణ్‌కు సన్మానం

కోనరావుపేట, జూన్ 22 : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మణ్ ఇటీవల ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. కాగా , ఆదివారం రామన్నపేట గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. సాయికృష్ణ, ఆంజనేయులు,జలందర్ తదితరులున్నారు.

కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి దుర్మరణం

శంకరపట్నం, జూన్ 22: మండలంలోని తాడికల్ గ్రామంలో గుర్తు తెలియని ఓ కారు ఢీకొట్టడంతో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన అనవేని కనకయ్య (65) సింగరేణిలో ఉద్యోగం చేసి ఇటీవల రిటైర్డ్ అయ్యాడు. ఆదివారం తాడికల్ ఇంటి నుంచి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అంబాల్‌పూర్ వైపు నుంచి తాడికల్ ప్రధాన రహదారి వైపు వేగంగా వస్తున్న ఓ గుర్తు తెలియని కారు ఢీకొట్టి అదే వేగంతో కరీంనగర్ వెళ్లిపోయింది. ఈ ఘటనలో కనకయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐ కట్కూరి శేఖర్‌రెడ్డి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తోట ఆగయ్య, జిందం చక్రపాణి

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 22 : మదీన యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 'కేటీఆర్ కప్' క్రికెట్ ప్రిమియర్ లీగ్ పోటీలను ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ టోర్నమెంట్ స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో కేటీఆర్ కప్ పేరుతో ప్రిమియర్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్న మదీన్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, మ్యాన రవి, సత్తార్, ఉస్మాన్, సయ్యద్ అక్రం, సయ్యద్ సోహైల్, తదితరులున్నారు.

నివాస స్థలాల కోసం తగాదా..

గొడవను అడ్డుకుంటున్న పోలీసులు, స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 22 : ఏండ్ల నుంచి నివాసముంటున్న స్థలాలను తమవేనని భూ యజమానులు చేస్తున్న ప్రయత్నాలపై రాజన్నపేటకు చెందిన ఓ కాలనీవాసులు భూ యజమానులతో గొడవకు దిగే ప్రయత్నాన్ని పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంతింజేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నపేటకు చెందిన బొప్పాపూర్ రాజయ్య, చాకలి నర్సయ్య, ముష్కం రాజు, చొక్కి దేవవ్వ, ద్యాప చిన్న కొమ్రయ్య, ఎనగుర్తి (ద్యాప)మల్లయ్య, ద్యాప పెద్ద ఎల్లయ్య, ద్యాప రాములు, ద్యాప రమేశ్, ద్యాప తిరుపతి అను వ్యక్తులు యాదవ కాలనీ సమీపంలో సుమారు 30 ఏండ్ల క్రితం అదే గ్రామానికి చెందిన కారంగుల విఠల్‌రెడ్డి అనే రైతు వద్ద నివాస స్థలాలను కొనుగోలు చేశారు. కాని, అందుకు సంబంధించిన పత్రాలు లేవు దీంతో విఠల్‌రెడ్డి ముగ్గురు కుమారులు హైకోర్టును ఆశ్రయించగా తీర్పు వారికి అనుకూలంగా వచ్చింది. అయితే ఇటీవల ద్యాప రమేశ్ తన ఇల్లుకు ప్రహరీ నిర్మాణం చేయగా, కోర్టు తీర్పుననుసరించి కార్యదర్శి రవి సదరు ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేయించారు. దీంతో కాలనీ వాసులు తమ ఇండ్లను ఆనుకొని ఉన్న వ్యవసాయ భూమిలో విఠల్‌రెడ్డి కుమారులు ట్రాక్టర్‌తో దున్నే ప్రయత్నం చేశారు. దీంతో కాలనీవాసులు అందరూ తమ సమస్యను పరిష్కరించిన పిదపే దున్నాలని దున్నకాన్ని నిలిపివేయించారు. సమాచారాం అందుకున్న పోలీసులు, గ్రామపెద్దలు రెండు రోజుల్లో ఇద్దరికీ ఆమోద యోగ్యమయ్యేలా మాట్లాడుకోవాలని చెప్పడంతో ఇరువర్గాలు శాంతించారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

రుద్రంగి, జూన్ 22 : లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ హనుమాన్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. లయన్స్ క్లబ్ రుద్రంగి అధ్యక్షుడిగా బండి యాదగిరి, సెక్రటరీగా కొమురె శంకర్, కోశాధికారిగా మంచె రాజేశం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రుద్రంగి అధ్యక్షుడు బండి యాదగిరి మాట్లాడుతూ, సమాజ సేవా కార్యక్రమంలో ముందుండి రుద్రంగి పరిసర గ్రామాలకు సేవా కార్యక్రమాలు అందిస్తామని తెలిపారు. మన దగ్గర ఉన్న పేదవారికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ హనుమాన్ల రాజిరెడ్డి మాట్లాడుతూ, సేవ చేయాలనే వారికి లయన్స్‌క్లబ్ మంచి వేదికగా ఉంటుందన్నారు. జెడ్‌సీ లయన్ రాపెల్లి శ్రీధర్, ఆర్‌సీ లయన్ కంటె శంకర్, ఎంజెఎఫ్ తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, సభ్యులు గడప రఘుపతిరావు, తీగల శశిధర్‌రావు, అంబటి శంకర్, గోడికార్ హీరోజి, మరిపెల్లి అంతయ్య, పుట్కపు మహేశ్, రాజేశం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రుద్రంగి, జూన్ 22 : మండలకేంద్రంలో హనుమాన్ ఆలయం నుంచి ఇందిరాచౌక్ వరకు ప్రధాన రహదారి సీసీ రోడ్డు పనులను ఆదివారం నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, హనుమాన్ ఆలయం నుంచి ఇందిరాచౌక్‌కు వెళ్లే దారి సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లాగా రూ. కోటి 52 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్, గండి నారాయణ, పల్లి గంగాధర్, కేసీరెడ్డి నర్సరెడ్డి, అభిలాష్, లింగం, యాదయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, మనోజ్, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన రోజు.. మొక్కలు నాటి..

మొక్క నాటుతున్న శంకర్

బోయినపల్లి రూరల్, జూన్ 22 : గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మండలకేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంట శంకర్ తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నేతలతో కలిసి ఇంటి ఆవరణలో మొక్క నాటారు. వారు మాట్లాడుతూ, తమ బోయినపల్లి ముద్దుబిడ్డ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, బోయిని రాజు, హరిత సేన సభ్యులు కమల్ గౌడ్ ఉన్నారు.



రైతు గ్రూప్‌లో వచ్చిన మెస్సేజ్

ఎస్‌బీఐ పేరిట సైబర్ మోసాలు

కరీంనగర్ రూరల్, జూన్ 22: గ్రామాల్లో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. ఎస్‌బీఐ యోనో పేరిట రూ.5,687 రివార్డు ఇస్తున్నారని, క్లయిమ్ చేసుకోవాలని నగునూర్‌కు చెందిన ఓ వ్యక్తి పేరిట అన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో మెస్సేజ్ ఫార్వర్డ్ చేశారు. రిడీమ్ చేసుకోవాలని ఏపీకే లింక్‌ను కూడా పంపించారు. కొందరు ఈ మెస్సేజ్ నమ్మి ఓపెన్ చేయడానికి ప్రయత్నించారు. అయితే ఎంతమంది హ్యాక్ అయ్యారో తెలియాల్సి ఉంది. ఓ వైపు అధికారులు సైబర్ మోసాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, మరోవైపు బహుమతులు, గిఫ్ట్ ఓచర్‌ల పేరిట వచ్చే మెస్సేజ్‌లకు జనం ఆకర్షితులవుతూనే ఉన్నారు.

బీసీ యువజన సంఘం కార్యాలయం ప్రారంభం

కోనరావుపేట, జూన్ 22 : మండల కేంద్రంలో జాతీయ బీసీ యువజన సంఘం కార్యాలయాన్ని ప్రసన్న హరికృష్ణ ఆదివారం ప్రారంభించారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండు వినోద్, మండలాధ్యక్షుడు ఎక్కలాదేవి జలందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్బసాని సందీప్, సాయికుమార్, మధు, సాయికృష్ణ, రవి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

విద్యార్థులతో ఉపాధ్యాయులు

బోయినపల్లి రూరల్, జూన్ 22 : మండలంలోని నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. అనంతరం ఒకరి కొకరూ ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

రాజన్న లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నర్సయ్య

నర్సయ్యకు బాధ్యతలు అప్పగిస్తున్న ఎంసీసీ రాజిరెడ్డి

వేములవాడ రూరల్, జూన్ 22 : వేములవాడ రాజన్న లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్యను ఆదివారం ఎన్నుకున్నారు. వేములవాడ పట్టణంలోని ఇన్‌కేబుల్ కార్యాలయంలో జరిగిన వేములవాడ రాజన్న లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికకు ముఖ్య అతిథిగా పీఎంజీఎప్ ఎంసీసీ హనుమాన్ల రాజిరెడ్డి హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్య, సెక్రటరీగా ఈసంపల్లి శ్రీనివాస్, క్యాషియర్‌గా తోట శేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా సుమన్, చాటెడ్ ప్రెసిడెంట్‌గా గొస్కుల రవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ, లయన్స్‌క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలు చేయాలని, లయన్స్‌క్లబ్ భవన ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల ప్రెసిడెంట్ కొలిపాక నర్సయ్య మట్లాడుతూ, వేములవాడ రాజన్న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యాల కోసం సామాజిక కార్యక్రమాలను చేపడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కిశోర్, కంటె శంకర్, రాపెల్లి శ్రీధర్, మాజీ ప్రెసిడెంట్ శ్రీనివాస్, చీకోటి సంతోష్, వెంకటేశ్వరావు, గోయికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏయిర్ వాల్ జాలీలు మాయం !

- ప్రమాదకరంగా నీటి సరఫరా
- శివారు ప్రాంతా